
# వెలితి

- వసుంధర



అంతకాలంగా రాజమండ్రిలో ఉన్నా నే నెప్పుడూ విశాఖపట్నం వెళ్ళలేదు. ప్రయాణాలన్నా ఊళ్ళు చూడడ మన్నా చెప్పలేని చిరాకు నాకు. ఈ యాభై ఏళ్ళ వయసులో నేను రెండు సార్లు తిరుపతి వెళ్ళాను. నాలుగైదు సార్లు మాత్రం పెళ్ళిళ్ళకని ఊరి ప్రయాణాలు చేశాను. చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్న కారణంగా నా మేనమామ నన్ను చేరదీసి పెంచి పెద్ద చేసి పెళ్ళి చేశాడు. కట్నం లేకుండా నన్ను పెళ్ళి చేసుకున్న మా వారికి పెళ్ళయ్యాక ఎన్నో విధాల కలిసొచ్చి పెద్ద ఆస్తిపరు డయ్యారు. ఆయన నన్ను అదృష్ట దేవత అంటారు. నాకు ముగ్గురు పిల్లలు. కూతురి పెళ్ళైపోయింది. కొడుకు లిద్దరూ ఉద్యోగ రీత్యా పొరుగు రాష్ట్రాల్లో ఉన్నారు. వాళ్ళకీ పెళ్ళిళ్లైపోయాయి.


నేను, వారు ఒంటరిగా ఉంటున్నాం. నాకు పని సాయాని కింట్లో వంటమనిషి, పనివాడు ఉన్నారు. వారు ఇంట్లోనే ఉంటూ ఆస్తి వ్యవహారాలు చూసుకుంటూంటారు. మాకు రోజులు సుఖంగా వెళ్ళిపోతున్నాయి. పిల్లలు మా దగ్గరకు రావడమే కానీ మే మెప్పుడూ పిల్లల దగ్గరకు వెళ్ళం.

వారం రోజుల క్రితం ఉన్నట్టుండి మా వారికి జబ్బు చేసింది. డాక్టరు వచ్చి చూసి జబ్బేమిటో అంతుపట్టడం లేదన్నాడు. నేను వెంటనే దానును పిలిపించాను.

దాను గ్రహదోషాలను కనిపెట్టడంలో, భూత, ప్రేత, పిశాచ గణాలను పారద్రోలడంలో అఖండుడు. చిన్నతనంలో ఎన్నోసార్లు నేను దాను చేత తాయెత్తులు కట్టించాను.

వారి కిలాంటివి నమ్మకం లేదు. కానీ 'ఈ వంకనైనా దాను కాళ్ళకు మొక్కి గౌరవిస్తున్నావు కాబట్టి నీ నమ్మకాన్ని నేనూ గౌరవిస్తాను' అనేవారు. నేను మెట్రిక్ పాసయ్యాను. ఎన్నో పుస్తకాలు చదివాను. ఆధునిక యుగంలో జీవిస్తున్నాను. నాయకుల ఉపన్యాసాలు వింటున్నాను. కానీ మన సమాజంలో ఉన్న దోషమో, నాలోని లోపమో - నేను బయటకు చెప్పకపోయినా అంతరాంతరాల్లో నేనూ ఎన్నో దురాచారాలను, మూఢాచారాలను నమ్ముతాను.

## అంతే మరి!



"నీకింద వెయ్యిమందికి పైగా పనిచేస్తున్నారు, పెద్దపెద్ద ఫైళ్ళన్నీ నీ చేతుల్లోనే ఉంటాయంటున్నావు. ఉద్యోగం ఎక్కడ?" అనక్కిగా అడిగాడు ఆత్మారామ్.

"అవును. మా ఎం.డి. ఆఫీసు ఎనిమిదో అంతస్థులో ఉంది. నేను ఆయన అటెండర్నే మరి" చెప్పాడు చిదంబరం.

శిరీష.




## సరిపోదు

"నువ్వు తాగుడు మానాలంటే ఒక్కటే చిట్కా. నీకు తాగాలన్పించినప్పుడల్లా - మీ ఆవిడ కో పది రూపాయలిస్తూ ఉండు" సలహా ఇచ్చాడు డాక్టర్.

"భలేవారే! అయితే నే నెన్ని వేలు సంపాదించినా సరిపోదు" అన్నాడు బీర్రాజు.

వాలి వీణామాధురి

అలాగే దాను శక్తినీ నమ్ముతాను.

దాను వచ్చి వారిని పరీక్షించి - "ఇది జబ్బు కాదు. దేవతల ఆగ్రహం. మీ మనసులో ఏదో వెలితి నాకు కనబడుతోంది. ఏ దేవత విషయంలోనైనా మీరు అన్న మాట తప్పారా?" అన్నాడు.

దేవత విషయంలో అనగానే వారు నావంక చూశారు. మా ఇంట్లో దేవతలకు మొక్కుకునేది నేనే మరి! నా కేం గుర్తు లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపాను.

దాను వెంటనే "నేను వెలితి, వెలితి, వెలితి అని మూడు సార్లంటాను. అప్పుడు మీ కేం గుర్తుకు వస్తుందో చెప్పండి" అన్నాడు.

వారు కళ్ళు మూసుకున్నారు. దాను కూడా కళ్ళు మూసుకుని దైవ ప్రార్థన చేశాడు. తర్వాత మూడుసార్లు "వెలితి, వెలితి, వెలితి" అన్నాడు.

"నాకు విశాఖపట్నం గుర్తు కొస్తోంది" అన్నారు వారు.

"విశాఖపట్నమంటే కనక మహాలక్ష్మి. అంటే ఆ అమ్మవారి విషయంలో మీరు మాట తప్పారు" అన్నాడు దాను.

అప్పుడు నాకు గుర్తొచ్చింది. రెండేళ్ళ క్రితం మా అమ్మాయి వచ్చి రెండు నెలలైంది. మూడేళ్ళ వయసున్న మా మనమడికి జ్వరం వస్తే వైద్యుడితో పాటు దానునూ పిలిపించాను. దాను మా అమ్మాయిని ప్రశ్నలు వేసి ఓ నిజం బయటపెట్టించాడు. అది విశాఖపట్నంలో దాని పిన్నత్తగారింటికి వెళ్ళి ఒక రోజున కనక మహాలక్ష్మి గుడికి ప్రయాణమై ఏదో ఆటంకం రాగా మానుకుంది.

"ఆ దేవతకు చాలా పట్టు. వస్తానన్నవారు వచ్చి తీరాల్సిందే!" అన్నాడు దాను.

మా అమ్మాయి విధిలేక వెళ్ళింది కానీ, దాని పిన్నత్తగారింటికి మళ్ళీ వెళ్ళడం ఇష్టం లేదు. ఆవిడ ప్రవర్తన బాగుండదట. విశాఖపట్నం వెడితే వాళ్ళింటికి వెళ్ళకనూ తప్పదు, వారం రోజు లుండకనూ తప్పదు.

దాను ఉపాయం చెప్పాడు "మీ బదులు మీ అమ్మగారక్కడికి వెళ్ళొచ్చు. అలాగని మొక్కుకుంటే శాపం ఆమెకు తిరిగిపోతుంది" అన్నాడు.

నే నలాగే చేశాను. దాను తాయెత్తు కట్టి వెళ్ళిపోయాడు. మనవడి జ్వరం మందుకో, తాయెత్తుకో ఆ సాయంత్రాని కల్లా తగ్గిపోయింది. ఇప్పు డా విషయం గుర్తు చేసుకుని "అయ్యో నేను కనక మహాలక్ష్మి దర్శనానికి వెళ్ళనే లేదు. అదే కాబోలు వెలితి" అన్నాను.

ఎందుకో వారు నిట్టూర్చారు. దాను తాయెత్తు కట్టి నన్ను వారం రోజుల్లో విశాఖపట్నం ప్రయాణం పూర్తి చేసుకు రమ్మన్నాడు.

"వెడితే ఎక్కడుంటావ్?" అన్నారు వారు.

"అక్కడ నా కెవరున్నారు?" అన్నాను నేను. ట్రెయిన్ దిగిన వెంటనే స్టేషన్నుంచి రిక్షా కట్టించుకుని గుడికి వెడతాను. రాత్రికి రాత్రి తిరుగు ప్రయాణ మవుతాను. వెడుతున్నది తెలుగూరికే కదా'


# కంచన్

## మిక్సర్లలో ఉత్కృష్టమైనది




## ఇప్పుడు నాన్ - స్టిక్ కుక్‌వేర్‌లో కూడా ప్రవేశించింది.

కంచన్ మీ వంటింటికి రెండు కానుకలు అందిస్తోంది.

కంచన్ మిక్సర్. అందమైనది. దృఢమైనది. రుబ్బుట, తురుముట, కలుపుట వంటి పనులను త్వరితంగా చేసే విధంగా రూపొందించ బడింది. 60 నిమిషాల రేటింగ్ మోటార్ అమర్చబడింది. సురక్షితమైనది, సున్నితమైనది అధికంగా పనిచేసే సామర్థ్యం కలిగి ఉంది. మీ వంటింటికోసం కంచన్ - నాన్ - స్టిక్ కుక్‌వేర్ అందిస్తోంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డ్యూపాంట్స్ టెఫ్లాన్‌తో తుది మెరుగులు దిద్దబడింది. మీ రుచికరమైన ఆహార పదార్థాలకు ఇది ఎంతో ఉత్తమమైనది. దీనితో వంట ఇంధనం, వంట చేసే సామగ్రి ఎంతో పొదుపు చేయవచ్చును. నాన్ స్టిక్ ప్రాపర్టీ కారణంగా మీ ఆహార పదార్థాల సువాసన నిలిచి ఉంటుంది. సరికొత్త మూతలతో అందంగా రూపొందించబడింది.

## కంచన్

8, వర్ధమాన్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, దహిసర్ (ఈ) బొంబాయి - 400 068 ఫోన్ 655400

అన్ని ప్రముఖ స్టోర్సులలో లభించును

వ్యాపార విచారణలు కోరబడుచున్నవి. BEAUTEX

## 2

విశాఖపట్నం ప్లాట్ ఫారం మీదకు ట్రెయిన్‌లోంచి దిగగానే నాకు భయం వేసింది. అంతులేని జనప్రవాహంలో నా కంత అయోమయంగా తోస్తోంది. ఆ సమయంలో ఎక్కణ్ణుంచో "అత్తయ్యా, నువ్వేనా?" అన్న పలకరింపు వినబడింది.

ఉలిక్కిపడ్డాను. కొద్ది క్షణాల్లో నా ముందు నిలబడ్డాడు వేణు.

వేణును నేను గుర్తుపట్టాను. చిన్నతనంలో వాడు మా ఇంట్లో పెరిగాడు. వాడి తల్లిదండ్రులు పేదవారు. వేణుకు బాగా చదువొస్తోందని మావారు వాణ్ణి మా ఇంట్లో ఉంచుకున్నారు. నాతో "మన కేమో ఓ పేదవాడికి తిండి పెట్టి చదివించిన పుణ్యం. నీ కేమో జీతం బత్తెం లేని పనివాడు" అన్నారు. ఆ మాటలు నాకు బాగా నచ్చాయి. ఫస్టు ఫారం నుంచి బియ్యే వరకు వాడు మా ఇంట్లోనే ఉన్నాడు.

"విశాఖపట్నం వస్తూ నాకు ఉత్తరమైనా రాయలే దేమిటి? అడ్రసు పారేసుకున్నావా లేక నన్ను మరిచిపోయావా?" అన్నాడు వేణు. వాడి పలకరింపులో ఆత్మీయత, వాడి మాటల్లో అభిమానం నన్నా శ్చర్యపరిచాయి.

వేణు విశాఖపట్నంలో ఉంటున్నాడని నాకు తెలుసు. వాడి అడ్రసు కూడా మా ఇంట్లో ఉంది. కానీ - మా ఇంట్లో ఉన్నంతకాలం వాణ్ణి నేను మా బంధువులా చూడలేదు. మా మనిషిలా భావించలేదు. వాడి చేత అన్ని పనులూ చేయించి, మా పిల్లల కొక్క పని కూడా చెప్పేదాన్ని కాదు. వాడికి నిలవ తిండి పెట్టేదాన్ని. మే మందరం ఖరీదైన పళ్ళు, జీడిపప్పు వగైరాలు కొనుక్కుని రహస్యంగా వాడికి తెలియకుండా తినేవాళ్ళం. ఏమైనా మిగిలి పారేయాల్సిన పరిస్థితి ఏర్పడితే అప్పుడే వాడికి పెట్టేదాన్ని. వా డేమీ అడిగేవాడు కాదు. పట్టించుకునేవాడు కాదు. తీరిక దొరికి నప్పుడల్లా చదువుకునేవాడు. క్లాసులో ఫస్టు రాకపోయినా ఫస్టు క్లాసు మార్కులతోనే పాసయ్యేవాడు. ఎవరి మీదా ఫిర్యాదు చేసేవాడు కాదు.

విశాఖపట్నంలో ఓ ప్రయివేటు కంపెనీలో చిన్న ఉద్యోగం వచ్చింది వాడికి. పదివేల ధరావతు కడితే పెద్ద ఉద్యోగం వచ్చేది. వాడు మాకు ఉత్తరం రాస్తే మేము వాడికి బదు లివ్వకుండా ఊరుకున్నాం. ఏటా వాడు మాకు ఉగాదికి గ్రీటింగ్స్ పంపుతా డు. రాజమండ్రి వచ్చినప్పుడల్లా కనిపించి, పలకరించి వెడుతూంటాడు.

వాడంటే నాకు మమకారం లేదు. కంటికి దూరం కాగానే నా మనసులోంచి మాయమైపోయాడు.

ఇప్పుడు వేణు నన్ను తమ ఇంటికి రమ్మని బలవంత పెడుతున్నాడు. అప్పుడు నేనున్న అయోమయావస్థలో అదే మంచి దనిపించింది. కానీ నాకు భయంగా ఉంది. ఇంటికి వెళ్ళాక వాడు నా మీద పగ తీర్చుకోడు కదా అని!

ఆటోలో వా డిల్లు చేరుకున్నాం. వద్దన్నా వినకుండా ఆటోకి వాడే డబ్బిచ్చాడు. చాలా చిన్న ఇల్లు. ఒక వరండా, రెండు చిన్న గదులు, వంటిల్లు, పెరట్లో బాత్రూం.

ఆ ఇంట్లో వేణు ముసలి తల్లిదండ్రు లుంటున్నారు. వారి పిల్లల్లో తల్లిదండ్రు ల్నాదరించే స్థితిలో ఉన్నది వేణు ఒక్కడే. అందుకే వా రిద్దరు వెంటనే నాకు నమస్కరించి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

వేణు నన్ను తన భార్యకు పరిచయం చేస్తూ "అత్తయ్య నాదరించని వెలితి ఉండిపోయిందని అన్నానుగా - ఈ రోజు నా అదృష్టం, మన అదృష్టం.." అన్నాడు.

ఆ మాటలు నన్ను వెటకారం చేస్తున్నట్లుగా భయపెట్టాయి. వేణు పగ తీర్చుకుందుకే నన్ను పిలిచాడా?

వేణు భార్య నాకు పాదాభివందనం చేసింది. వాడి కిద్దరు మగ పిల్లలు. ఇద్దరూ ముద్దుగా, బొద్దుగా, సంస్కారవంతంగా ఉన్నారు.

నే ననవసరంగా అనుమానించాను కానీ వేణు నన్ను చాలా బాగా చూసుకున్నాడు. నాకు ప్రత్యేకంగా ఓ గది ఇచ్చేశాడు. షడ్రసోపేతంగా వండించి పెట్టించాడు. ఊళ్ళోని ఖరీదైన స్వీట్స్, పళ్ళు, జీడిపప్పు నా కోసం ప్రత్యేకంగా తెప్పించాడు.

వేణు అతిథి మర్యాద అపూర్వం.

సాయంత్రం అంతా కలిసి కనక మహాలక్ష్మి గుడికి వెళ్ళాం. దర్శనం బాగా అయింది. రాత్రికి నేను ప్రయాణమైతే కనీసం మరో రోజైనా ఉండి వెళ్ళాలని వేణు బలవంత పెట్టాడు. వారు కంగారు పడతా రని నే నంటే "మామయ్యకు ఫోన్ చేసి చెప్పేశా నత్తయ్యా" అన్నాడు.

నకల మర్యాదలతో మరో రోజు ఇంట్లో గడిపాను. నాకు చాలా సంతోషంగా ఉంది. వేణు నన్నింతగా అభిమానిస్తున్నా డంటే వాడికి నా పట్ల బాగా కృతజ్ఞతా భావముండి ఉండాలి. అంటే ఆ భావం నేనే వాడిలో కలగజేశా నన్నమాట!

రెండో రోజు రాత్రి ఎందుకో నాకు నిద్ర పట్టలేదు. లేచి వరండాలోకి వచ్చాను. అక్కడ వేణు పిల్లలు నిద్రపోతున్నారు. పెరట్లోంచి మాటలు వినబడుతున్నాయి.

నేను పెరట్లోకి వెళ్ళబోయి ఆగిపోయాను. వేణు, భార్య మాట్లాడు కొంటున్నారు. ఆ మాటలు నాకు స్పష్టంగా వినబడుతున్నాయి. అవి నాగురించే!

"చాలా ఖర్చయింది. ఈ అప్పంతా ఎలా తీరుస్తారు?"

"అప్పు గురించి ఆలోచించకు. నే నీ రోజు ఇలా ఉన్నానంటే అంతా అత్తయ్య చలవే. ఒక్కసారైనా ఇంటికి పిలిచి చీర పెట్టలేదని నాకు బాధగా ఉండేది. ఇప్పుడు నా కెంతో సంతోషంగా ఉంది"

"పది వేలు కడితే మీకు ప్రమోషనొస్తుంది. ఆవిణ్ణడక్కూడదూ?"

"బాగుంది. అప్పుడత్తయ్య నా ఆదరణంతా డబ్బు కోసమే అనుకుంటుంది. నా మనసుకు వెలితిగా ఉంటుంది."

"పిల్లల కెపుడూ ఇలా పళ్ళు, స్వీట్లు, జీడిపప్పు కొనలేదు మీరు. వాళ్ళు చూసి మాకూ కావాలని ఏడ్చారు. ఆవిడక్కూడా మన కున్నంతలో మామూలుగా ఆతిథ్యం ఇస్తే సరిపోయేది. ఎందుకీ లేనిపోని గొప్పలు మీకు?"

"గొప్పలు కాదు. అత్తయ్య కిలా భోంచేయడం రోజూ అలవాటు. మనింట్లో ఏ లోటూ జరక్కూడదని నా ఉద్దేశం. పిల్లలకు తెలియకుండా రహస్యంగా పెట్టమని నీకు చెబితే నీ కా రహస్యం చేతకాలేదు. మన వాళ్ళవి రుచిమరిగితే రోజూ కావాలని అడుగుతా రు నే నెక్కణ్ణించి తేగలను?"

నే నిక వినలేదు. నా గదిలోకి వెళ్ళిపోయాను. నేను పెట్టగలిగీ పెట్టడం ఇష్టం లేక వేణూకు తెలియకుండా రహస్యంగా ఖరీదైన తినుబండారాలు తినేదాన్ని. ఆ విషయం వేణు దగ్గర దాగలేదన్నమాట! కానీ అందుకు వాడు నా మీద ప్రతీకారం తీర్చుకోలేదు సరిగదా - తనకు స్తోమత లేకపోయినా రహస్యంగా నన్నాదరించాలని చూశాడు.

మర్నాడు సింహాద్రిలో నా ప్రయాణం. వేణు నాకు చీర పెట్టాడు. తను నా కూడా సాయం వస్తానన్నాడు.


"సకుటుంబంగా వారం రోజులుండేలా మా ఇంటికొస్తేనా రా" అన్నాను. అప్పుడు వాడికి పదివేలూ ఇవ్వాలని నా ఉద్దేశం.

వేణు ఎంతో సంతోషించి వీలు చూసుకుని తప్పక వస్తానన్నాడు.

నేను పిల్ల లిద్దరి చేతుల్లోనూ చెరి వందా పెట్టాను.

రాజమండ్రిలో ఇంటికి తిరిగి వెళ్ళేసరికి వారి జబ్బు పూర్తిగా నయమైంది. వారికి నేను జరిగినదంతా చెప్పి "ఇన్నాళ్ళూ గుర్తించలేకపోయాను వేణు మనకు నాలుగో బిడ్డ" అన్నాను.

వారు వెంటనే "విశాఖపట్నం గుర్తుకు రాగానే నా కిప్పుడు వెలితి అనిపించడం లేదు" అన్నారు. ★



### కళారోదన

"మన కళారాధన కార్యక్రమాల్లో పేరు నిలుపుకుందన్నారా, పొగడ్తే కదా. దాని కెందుకు చిర్రు బుర్రు లాడతావు?" అడిగాడు పానకాలరావు.

"ఓ అయిదు రూపాయలు తక్కువిచ్చానని బేనర్లపైన 'కళారోదన సంస్థ' అని రాశా డా ఆర్టిస్టు" చెప్పాడు పాపారావు.